## 3

# ఇందిరా విజయం

"అక్కా! నా పెళ్ళి నిశ్చయమయింది. పెళ్ళికొడుకు మా బావే... చనిపోయిన మా అక్క భవాని మొగుడే. ఈ మాట చదవగానే కోపంతో మండి పడతావో, అసహ్యించుకుంటావో. మధ్య తరగతి ఇంటి ఆడ పిల్లను. కట్నం లేకుండా ఉదారంగా కన్నె చెర విడిపిస్తానన్న బావను కాదంటే కల్యాణయోగమే వుండదట! నువ్వు నా పెళ్ళికి రావని నమ్మకం. అయినా నీకు రాయాలనిపించింది. అమ్మ నాన్నా విషం మింగి చస్తామని బెదిరించి ఈ పెళ్ళికి ఒప్పించారు నన్ను. ఇందిర "

ఉత్తరం చదవగానే మనసంతా కలచి వేసినట్టు అల్లకల్లోలంగా తయారయింది.

జూలై పదిహేనోతారీఖు నాకు మరపురాని రోజు. ఆరోజు భవాని ఆత్మహత్యా ప్రయత్నం చేసి చావు బ్రతుకుల్లో వుందని కబురు తెలిసి హాస్పిటల్‌కు పరిగెత్తాను.

నేను వెళ్ళేసరికి భవానికి స్పృహ వచ్చింది. నన్ను చూడగానే బావురుమని ఏడ్చింది.

"చావడానికి కూడా ఆడదానికి స్వాతంత్ర్యం లేదే. నువ్వైనా నాకింత విషం తెచ్చివ్వు రజితా!" అంటూ నా చేయిని పట్టుకుని కన్నీరు కార్చింది.

సరిగ్గా సంవత్సరం క్రిందట పెళ్ళికూతురుగా కల కల లాడుతూ కనిపించిన భవానిని ఆ దీన స్థితిలో చూసి నాకళ్ళు నీటితో నిండాయి. భవాని మొగుడు మంచి అందగాడు. మంచి జీతం వచ్చే ఉద్యోగం వుంది. భవాని అందాన్ని చూసి ఇరవై వేల కట్నానికే పెళ్ళికి ఒప్పుకున్నాడు.

భవాని తండ్రి శంకరంగారు ఆస్థిపాస్తులేవీ లేని చిరుద్యోగి. ప్రావిడెంటు ఫండు మీద అప్పు తీసుకుని, వున్న ఒక్క పెంకుటింటినీ కుదువ పెట్టి పెళ్ళి అయిందనిపించాడు. కానీ కట్నం బాపతు అయిదువేలు అల్లుడికి బాకీ పడ్డాడు.

సినిమా ఫక్కీలో తాళి విసిరిగొట్టి పీటలమీదనుండి పెళ్ళి కొడుకు లేచి వెళ్ళిపోనందుకే బ్రహ్మానంద పడ్డాడాయన. ఎలాగైనా ఆర్నెల్లలో సొమ్ము సర్దుబాటు చేస్తానని అల్లుడిగార్ని బ్రతిమిలాడి కూతుర్ని కాపురానికి పంపించాడు.

భవాని కాపురం ఆరునెలలదాకా బాగానే సాగింది. అటు తర్వాత మొదలయ్యింది

అతని సాధింపు. కట్నం బాకీ అయిదువేలతో బాటు మరో అయిదువేలు కలిపి తెస్తేనే తిరిగిరమ్మని భవానిని పుట్టింటికి తరిమాడు. స్కూటరు కొనుక్కోవాలని అతడి ముచ్చట.

"అది చదువుకుంటానంటే ఆడ పిల్లకు చదువెందుకని మానిపించి నాలుగేళ్ళు ఇంట్లో కూర్చోబెట్టాను. నీలాగా డిగ్రీ తీసుకుని అదీ నాలుగురాళ్ళు సంపాదిస్తూ వుండి వుంటే అల్లుడు ఇలా వేధించేవాడు కాదేమో!" అంటూ వాపోయింది సావిత్రమ్మ పిన్ని.

ఇంట్లోవున్న వెండి కంచం, చెంబు అమ్మి మూడు వేలు అల్లుడుగారికి ఇచ్చి త్వరలో మిగితా డబ్బు ఇస్తామని నచ్చజెప్పి భవానిని అతడి దగ్గర వదలి వచ్చారు శంకరం గారు.

ఇదంతా జరిగి మూడు నెలలయిందేమో ఇంతలో ఆ అఘాయిత్యం తల పెట్టింది భవాని.

"కట్నంకోసం వేదిస్తే పుట్టింటికి వెళ్ళి ఏదో చెప్పుకోవాలిగానీ ప్రాణాలు తీసుకుంటారుటే? కోపాన్ని, దుఃఖాన్ని అణచుకుంటూ అన్నాను.

"నన్ను కొట్టినా, హింసించినా నోరెత్తలేదు రజితా! కానీ నా కడుపులో ఊపిరి పోసుకుంటున్న బిడ్డను చంపుతానంటే భరించలేక నేనూ చచ్చిపోదామనుకున్నానే" ఏడుస్తూ అన్నది భవాని.

"నేను వద్దని మొత్తుకుంటున్నా వినకుండా స్కానింగ్ చేయించాడు. డాక్టరు ఆడపిల్ల అని చెప్పింది. అప్పటినుండి అబార్షను చేయించుకోమని రోజూ కొట్టేవారు. అమ్మా వాళ్ళ దగ్గరకు వెళ్తేలాభం వుండదని తెలుసు. పెళ్ళి కావల్సిన పిల్లలున్న తల్లిదండ్రులు వాళ్ళు. నీ భర్త ఇష్ట ప్రకారమే కానీ అని పంపిస్తారు గానీ నా భారం వహించే ధైర్యం చేయలేరు. అందుకే చచ్చిపోయి సుఖపడదామనుకున్నా.. అదీ పడనివ్వలేదు..?" పూడుకు పోతున్న గొంతుతో అంది భవాని.

బయట నుండి వచ్చిన సావిత్రమ్మ పిన్ని నన్ను చూడగానే గట్టిగా ఏడ్చేసింది.

'చూడమ్మా రజితా! దీని మొండితనంతో అల్లుడికి అప్రదిష్ట తెచ్చి మా కడుపున చిచ్చుపెట్టే పని చేసింది. ఏదైనా జరిగి వుంటే దీని చెల్లెళ్ళు జీవితాంతం పెళ్ళికాకుండా ఏడవాల్సివచ్చేది." అంటూ దుఃఖ పడిందావిడ.

అల్లుడు కూతుర్ని హింసిస్తుంటే ఆ పిల్లను ఆదుకునే ధైర్యంలేని వీళ్ళు అల్లుడి అప్రదిష్ట గురించీ, మిగితా కూతుళ్ళ పెళ్ళి గురించీ బాధ పడుతున్నారా లేక భవాని తమకు దక్కకుండా పోయేదని దిగులు పడుతున్నారో అర్థంకాలేదు నాకు.

ఆ రాత్రికి భవాని దగ్గర నేను వుంటానని వాళ్ళను ఇంటికి పంపించేసాను.

"పెళ్ళి చేసేస్తే భారం తీరిపోతుందనుకున్నారు పాపం. వాళ్ళకు శనిలా దాపురించాను. పోయివుంటే ఒక ఏడుపు ఏడ్చి వూరుకునేవారు.ఇప్పుడు పేరు ప్రతిష్టల గురించి దిగులు పడుతున్నారే గానీ నేనెంత నరకం అనుభవించానో ఆలోచించరు." భవాని మాటలు వినలేక "మాట్లాడకుండా పడుకో..." అన్నాను ఓదార్పుగా 'ఎలా పడుకోమంటావే? అంటూ కష్టంమీద పక్కకు పొర్లి "చూడవే.. ఆడపిల్లను చంపడానికి ఇష్టపడలేదని నాకు పడిన శిక్ష అంది.

ఆమె వీపు మీద నడుము మీద వున్న వాతలు చూసి ఒళ్ళు జలదరించింది నాకు.

"అతడు మనిషా? రాక్షసుడా? అంతగా బాదుతుంటే తిరగబడకుండా ఎందుకూరుకున్నావు?" ఆవేశంగా అన్నాను.

భవాని నీరసంగా నవ్వింది.

"తిరగబడితే ఆ ఇంట్లో వుండగలనా? భర్త ఇంటిగడపదాటిన ఆడపిల్లకు పుట్టింట్లో చోటు దొరకని సమాజం మనది. అతడి చేతుల్లో నేను చచ్చిపోయినా ఏడ్చి వూరుకుంటారు గానీ వదలి పెట్టి వస్తే మా వాళ్ళు వురిపోసుకుంటారు! అంది.

ఇంటికి తీసుకువెళ్ళిన మూడోరోజున భవాని బావిలో దూకి చనిపోయింది. అల్లుడు ఏం చెప్పేడోగాని తలిదండ్రులు గొడవ చేయక ఏడ్చి వూరుకున్నారు.

* * *

ఆరునెలలు తిరక్కముందే ఇందిర నుండి ఈ ఉత్తరం. ఇందిర భవాని చెల్లెలు.

అక్కను హింసించి, ఆమె మరణానికి కారణమైన అతడిని భర్తగా అంగీకరించడానికి ఇందిర మనసెలా ఒప్పిందో అర్ధంకాలేదు. ఆరాత్రి నాకు నిద్ర పట్టలేదు.

మర్నాడు సెలవుపెట్టి ఇందిర దగ్గరకు బయల్దేరాను. సిటీకి ఇరవై కిలోమీటర్ల దూరం వాళ్ళ పల్లె.

నన్ను చూడగానే నిర్ఘాంతపోయింది ఇందిర.

"నా మీద కోపంతో అసహ్యంతో ఇక జన్మలో నాముఖం చూడవేమో అనుకున్నాను." విషాదంగా అంది ఇందిర.

నేను జవాబు చెప్పకుండా లోపలికి నడిచాను. సావిత్రమ్మ పిన్ని సంతోషంగా కనబడింది. పెళ్ళిపనులు మొదలు పెట్టిందట.

సాయంత్రం పిన్నితో అన్నాను. ఇందిరను రెండ్రోజులు నాతో పంపించు పిన్నీ. పెళ్ళయ్యాక ఎలాగూ రాలేదు.." అని

పిన్ని సంతోషంగా ఒప్పుకుంది. ఈ పెళ్ళి చాల సహజమైన విషయంగా నేను మాట్లాడ్డం ఆవిడకు ధైర్యాన్నిచ్చిందనుకుంటాను.

మర్నాడు ఇందిరను వారిజ దగ్గరకు తీసుకు వెళ్లాను. పనిలో తలమునకలుగా వుంది వారిజ.

కుట్టిన బట్టల కోసం వచ్చిన వాళ్ళకు అవి ఇచ్చి పంపింది. కుట్టు నేర్చుకోవడానికి వచ్చిన నలుగురు అమ్మాయిలకు పని ఒప్పగించి మమ్మల్ని లోపలికి తీసుకువెళ్ళింది వారిజ.

"ఈ అమ్మాయి ఎవరక్కా?" అంది ఇందిరను చూస్తూ "నా స్నేహితురాలు భవాని తెల్సుగా? తన చెల్లెలు. వచ్చే నెలలో వాళ్ళ బావను, అంటే భవాని భర్తను పెళ్ళాడబోతుంది." చాలా మామూలుగా చెప్పాను.

"పెళ్ళి కాకుండా వుండిపోతానని భయపడి ఈ పెళ్ళికి ఒప్పుకున్నారా? లేక ఒంటరిగా బ్రతకలేనన్న అధైర్యంతోనా?" సూటిగా ఇందిర కళ్ళలోకి చూస్తూ

ప్రశ్నించింది వారిజ.

ఇందిర అసహనంగా కదిలి, ఇబ్బందిగా నా వైపు చూసింది.

"భవాని గురించి వారిజకు అన్ని విషయాలూ తెలుసు ఇందిరా! వారిజ నాకు ఆప్తురాలు. నీ వ్యక్తిగత విషయం గురించి అడిగే హక్కు ఆమెకు లేదు అనుకుంటున్నావు కదూ? వారిజ గురించి నీకు చెప్పాలనే ఇక్కడకి తీసువచ్చాను నిన్ను. నేను చెప్పడం దేనికి? తనే చెబుతుంది విను..." ఇందిర చేతిని నా చేతిలోకి తీసుకుంటూ లాలనగా అన్నాను.

ఈలోగా వారిజ మాకు కాఫీ తీసుకువచ్చింది.

"ఒకనాడు నేను ఇలా నా కాళ్ళమీద నేను నిలబడి తలెత్తుకుని బ్రతకగలనని కలలో కూడ అనుకోలేదు ఇందిరా... మాఊళ్ళోని ఆడపిల్లమీద అత్యాచారం జరిగిందని పేపర్లో చదివే వుంటావు. ఆపిల్లను నేనే ఇందిరా!" అంది ఏభావమూ ధ్వనించని గొంతుతో. ఇందిర వులిక్కిపడి నా చేయి పట్టుకుంది.

"మా అమ్మ నాన్నా పరువు నడివీధికి లాగ వద్దని బ్రతిమలాడారు. పోలీసు కంప్లయింట్ ఇవ్వకపోతే నన్ను పెళ్ళాడుతానన్నాడు ఆ నరపశువు. కామాంధుడి వలన అత్యాచారానికి గురైన ఆడపిల్ల ఆత్మహత్యే శరణ్యమనుకుంటుంది. లేదా ఆ దుర్మార్గుడితో మెడలో మూడుముళ్ళు వేయించుకుని బలి పశువు అవుతుంది. ఇదే మన సినిమాలలోనూ, కథలలోనూ చూపిస్తారు. కానీ నేను అతనికి భార్య కావడానికి ఒప్పుకోలేదు. అతనికి శిక్ష పడేదాక వూరుకోలేదు. నాకు జరిగిన అన్యాయం మరొకరికి జరగకుండా అతని కథ పదిమందికి కనువిప్పు కావాలని పోరాడాను. ఇరుగు పొరుగులు ఛీత్కరించినా, సంఘం వెలివేసినా, ఆఖరికి కన్న వాళ్ళు తరిమేసినా బ్రతుకు పోరాటం సాగించాను. నా గురించి ఎన్నోరకాలుగా వ్యాఖ్యానించి, అపహాస్యం చేసి అలసిపోయి వూరుకుంది సమాజం. ఇదిగో ఇవాళ ఇలా మరో నలుగురికి వుపయోగపడే విధంగా బ్రతుకు తున్నాను." వారిజ చెప్పడం ముగించి దీర్ఘంగా నిట్టూర్చింది.

"ఇప్పుడు చెప్పు ఇందిరా! మనసు చంపుకుని ఆ మనిషితో పెళ్ళి అనే బంధంలో ఇరుక్కుని బ్రతుకు నరకం చేసుకుంటావా? కాసింత ధైర్యం చేసి నీ బ్రతుకు నీవు బ్రతకలేవా? ఆలోచించి నిర్ణయం తీసుకో. కట్నం కోసం భార్యను కిరోసిన్ పోసి తగలబెట్టే భర్తలూ, కూతుర్ని చంపిన ఆ మగవాడికే మరో కూతుర్నిచ్చి పెళ్ళి చేసే తలితండ్రులూ, పరువుకోసం ప్రతిష్ట కోసం ఎలాంటి హింసనైన మౌనంగా భరించే ఆడవాళ్ళూ అత్యాచారాలకు గురైన అభాగినులను తలెత్తుకు తిరగనివ్వని పెద్దమనుషులు మారనంతవరకు ఆడవాళ్ళకు మోక్షం లేదు ఇందిరా! వాళ్ళలో మార్పురావాలంటే మనమే ఎదిరించి పోరాడాలి. ఎక్కడో ఒక చోట ఎవరో ఒకరు తిరుగుబాటు చేసి ఎదురు తిరిగి తేనే క్రమంగా సంఘంలో మార్పు వస్తుంది..." అనునయంగా అన్నాను ఇందిరతో. ఇందిర మాట్లాడలేదు.

రెండ్రోజుల తరువాత వాళ్ళవూరు వెళ్ళిపోయింది.

వారం తర్వాత నాకు రెండు ఉత్తరాలు వచ్చాయి. ఒకటి సావిత్రమ్మగారినుండీ, మరొకటి ఇందిర నుండీ.

ఇందిర ఇలా రాసింది.

అక్కా,

నాపెళ్ళి కాన్సిల్ అయింది. అమ్మ ఏడ్చింది. నాన్న బాధ పడ్డారు. కానీ నేను మనసు మార్చుకోలేదు. ఇంట్లోనే చిన్న పిల్లలను సంరక్షించే 'క్రష్' పెట్టాను. ప్రస్తుతం ముగ్గురు ఉద్యోగినులు తమ పిల్లలను  నాదగ్గర వదలి వెళ్తున్నారు నిశ్చింతగా ఒక ఉపయోగకరమైన పని చేస్తున్నానని తృప్తిగా వుండటమే కాక నా వాళ్ళకు భారం కానన్న ఆత్మ విశ్వాసమూ కలుగుతూంది. నీకు కృతజ్ఞతలు ఎలా తెలుపను. వారిజ గారికి చెప్పు

నీ

**ఇందిర.**

సావిత్రమ్మ గారు ఏం రాసి వుంటారో ఊహించగలను కనుక ఆవిడ ఉత్తరం చదవకుండానే చింపి పారేసాను. ఇందిర విజయం నాకు ఉత్తేజాన్నిచ్చింది. ఫరవాలేదు. మనుషులు మారుతున్నారు.....

• *A.I.R. Kurnool-30-9-1994* •